www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 23 మే 2025
5
ఏలూరు

నేడు ఏలూరుకు మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ అభివృద్ధి, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ నెల 23వ తేదీ శుక్రవారం ఉదయం 11.00 గంటలకు ఏలూరు కలెక్టరేట్‌కు చేరుకుంటారు. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉద్యానవన ప్రత్యేక కార్యదర్శి, కలెక్టర్, కోకో రైతులు, ప్రజా ప్రతినిధులు, కోకో కంపెనీ ప్రతినిధులతో సమావేశమవుతారు. అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు ఏలూరు నుంచి బయలుదేరి విజయవాడ వెళ్తారు.

ఎండు గడ్డి కొరత..!

ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో యంత్రాలతో కోతలు

గడ్డి ముక్కలు ముక్కలు కావడంతో అవస్థలు

గడ్డి చుట్టే యంత్రాలవైపు పాడి రైతులు మొగ్గు

ఆచంట వేమవరంలో యంత్రం ద్వారా చుట్టిన గడ్డి కట్టలు

ప్రజాశక్తి - ఆచంట

పశువులకు ఎండు గడ్డి సరిగ్గా దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో పాడి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల వరికోత యంత్రాల వినియోగం పెరగడంతో గడ్డి కాస్త ముక్కముక్కలుగా అయిపోతోంది. దీంతో పశువులకు నాణ్యమైన గడ్డి అందక రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. రైతులు పశువులకు యంత్రాలతో కోతలు కోయిస్తున్న నేపథ్యంలో గడ్డి ఎందుకూ పనికి రాకుండా పొలాల్లోనే ఉండిపోతున్న పరిస్థితి.

మండలంలో 90 శాతం వరకూ వరి కోతలు యంత్రాలతో నిర్వహించడంతో నేడు ఎండు గడ్డికి తీవ్ర కొరత ఏర్పడింది. కొందరు రైతులు వరిచేల్లోని ముక్కలు ముక్కలుగా అయిపోయిన గడ్డిని సేకరించలేక, సేకరించినా మోపులుగా చేసుకునే వీలు లేకపోవడంతో వరి చేల్లోనే వదిలేసి తగలబెట్టేస్తున్నారు.

అయితే ఈ తరుణంలో వరి కోత యంత్రాల మాదిరిగానే వరిగడ్డి చుట్టే యంత్రాలు సైతం అందుబాటులోకి రావడంతో వీటిపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇవి గత 4, 5 సంవత్సరాల క్రితమే అందుబాటులోకి వచ్చినా రైతుల చెంతకు చేరడంలో ఆలస్యమైంది. ఈ ఏడాది వ్యవసాయ అధికారులు సైతం ఈ యంత్రాలపై అవగాహన కల్పించడం, ఎండు గడ్డి లేక పాడి పశువులను పోషించడానికి అధిక వ్యయం చేయాల్సి రావడంతో పాడి రైతులు గడ్డి చుట్టే యంత్రాల వైపు ఆసక్తి చూపిస్తున్నారు. కోత యంత్రాలతో వరి మాసూళ్లు పూర్తి చేసిన చేలల్లోని గడ్డిని చుట్టే యంత్రం ద్వారా సేకరించి పురి కుళలతో మోపులుగా వరిచేల్లో వదిలేస్తుంది. దీన్ని రైతులు సేకరించుకొని ట్రాక్టర్ల ద్వారా లేక, కూలీలతో మోయించుకుంటూ గడ్డిమేట్లు వేసుకుంటున్నారు. ఒక మోపునకు సుమారు రూ.35 వరకూ ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. ఎకరానికి సుమారు 50 నుంచి 60 మోపుల వరకూ గడ్డిని సేకరించగలుగుతున్నారు. దీంతో ఎకరానికి రూ.4 నుంచి రూ.5 వేల వరకూ గడ్డి సేకరణకు ఖర్చవుతోందని రైతులు చెబుతున్నారు. అయితే సేకరించిన గడ్డిని వదిలేయకుండా మేట్లుగా వేసి వర్షం పడినప్పుడు బరకాలతో కాపాడుకుంటున్నామని చెబుతున్నారు.

గడ్డి చుట్టలను మేటుగా వేసి భద్రపరచుకుంటున్న పాడి రైతు

ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంటను వేగవంతంగా కోసి ఒబ్బిడి చేసుకోవడానికి వరికోత యంత్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని రైతులు చెబుతున్నారు.

మండలంలో 10,150 ఎకరాల్లో దాళ్వా వరి సాగు చేపట్టారు. జులై, ఆగస్టు, సెప్టెంబర్‌లో వచ్చే వరదల కారణంగా పశుగ్రాస కొరత ఏర్పడుతుంది. ముఖ్యంగా వర్షాకాలంలో ఎండుగడ్డిని ఎక్కువగా వినియోగించుకుంటారు. ఆయా నెలలో పశువులకు మేత కొరత రావడంతో ఎకరం గడ్డిని రూ.10 వేలతో కొనుగోలు చేస్తే, మరో రూ.2,000 ట్రాక్టర్ కిరాయికి, గడ్డిమేటు వేయడానికి ఎగుమతి, దిగుమతికి రూ.3 వేలు ఖర్చవుతుంది. మొత్తంగా ఎకరం గడ్డికి రూ.15 వేలు ఖర్చవ్వడంతో రైతులు హడలెత్తిపోతున్నారు. దీంతో రైతులు యంత్రాలు ఆధారపడి ఎండు గడ్డి కొరతను అధిగమించేందుకు గడ్డి చుట్టే యంత్రాలను ఉపయోగించుకుంటున్నారు.

గడ్డి ధర పెరిగింది..

బొర్రా నరసింహారావు, కౌలు రైతు, ఆచంట వేమవరం

ఇప్పటికే గడ్డి, దాణా ధరలు చుక్కలనంటడంతో పలు మంది రైతులు గేదెలు, ఆవులను కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదు. దీంతో పశుసంపద తగ్గి రెడిమేడ్ పాలపై ఆధారపడుతున్నారు. గతంలో పండ గడ్డిని రైతులు ఉచితంగా ఇచ్చేవారు. ప్రస్తుతం యంత్రాల ద్వారా సేకరించిన గడ్డిని మేట్లుగా వేసుకుని పశువులకు వినియోగిస్తున్నారు.

అందుబాటులో గడ్డిచుట్టే యంత్రాలు..

బొక్క బాబూరావు, రైతు, ఆచంట వేమవరం

గడ్డి సేకరణకు అధిక మొత్తంలో కూలి చెల్లించలేక వదిలేస్తున్నాం. వరి కోత యంత్రం లాగానే వరిగడ్డి చుట్టే యంత్రాలు సైతం అందుబాటులోకి రావడంతో వీటిపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఒక మోపునకు సుమారు రూ.35 ఖర్చవుతుంది. ఎకరానికి 50 నుంచి 60 మోపుల వరకూ గడ్డిని సేకరించి మేట్లు వేసుకొని బరకాలతో ఆ గడ్డిని కాపాడుకుంటున్నాం.

మాతా, శిశు మరణాలు అరికట్టాలి

వైద్యాధికారులతో కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్ష

వైద్య సిబ్బందితో సమీక్షిస్తున్న కలెక్టర్ వెట్రి సెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో మాతా, శిశుమరణాలు సంభవించకుండా కృషి చేయాలని, గత మరణాలను సమగ్రంగా విశ్లేషించి పూర్తిస్థాయిలో మరణాల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో వైద్య, ఆరోగ్యశాఖ జిల్లా అధికారులతో జిల్లాలో చోటుచేసుకున్న మాతా, శిశు మరణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏ తల్లీ జన్మనిస్తూ, ఏ బిడ్డా జన్మిస్తూ మరణించకూడదనే లక్ష్యంతో పనిచేయాలన్నారు. అక్టోబరు 2024 నుంచి మార్చి 2025 వరకూ చోటుచేసుకున్న 8 మాతృమరణాలు, 7 శిశు మరణాలకు సంబంధించి నివేదికలను పరిశీలించారు. వీటిపై ప్రత్యేకంగా చర్చించి కారణాలను వెలికితీయాలని ఆదేశించారు. మరణాలు సంభవించకుండా చర్యలు చేపట్టాలన్నారు. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యేవరకూ ప్రతి ఆశా, ఆరోగ్య కార్యకర్త, హెల్త్‌సూపర్‌వైజర్ నిరంతరం వారికి అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు ఆరోగ్య వివరాలు సేకరించాలన్నారు. అలాగే ఐసిడిఎస్ సిబ్బంది పౌష్టికాహారం అందిస్తూ రక్తహీనత లేకుండా చూచుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా నమోదైన గర్భిణులకు ముఖ్యంగా హైరిస్క్ గర్భిణులకు కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని, రక్తహీనతతో బాధపడే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. హై రిస్క్ కేసులను సమీపంలోని మంచి సిహెచ్‌సి లేదా ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేసి మెరుగైన వైద్యసేవలందించాలన్నారు. బరువు ఎక్కువ ఉన్న (ఒబిసిటి) గర్భిణుల విషయంలో బరువు తగ్గేలా అవగాహన కలిగించాలన్నారు. ఆసుపత్రుల్లో మరింత మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రివెంటబుల్ మరణాలు సంబవించిన సందర్భాల్లో సీనియర్ వైద్యాధికారులతో విచారణచేసి కేసు స్టడీ చేయాలన్నారు. సమావేశంలో డిసిహెచ్ఎస్ పాల్ సతీష్ కుమార్, డిఎంహెచ్ఒ ఆర్.మాలిని, ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ రాజీవ్, డిఐఒ నాగేశ్వరరావు, పలు ప్రయివేటు ఆసుపత్రుల వైద్యులు, పలువురు మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయులకు వైద్యశిబిరం

ఏలూరు సర్వజన ఆస్పత్రిలో ఏర్పాటు

డిఇఒ ఎం.వెంకట లక్ష్మమ్మ - ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరు, భీమవరం, రాజమండ్రి జిల్లాల పరిధిలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన టీచర్ల బదిలీ నియమావళి చట్టం 2025కు లోనైన ఉపాధ్యాయుల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీలోకి వస్తున్న వారు బదిలీకి అర్హత పొందేందుకు అవసరమైన మెడికల్ సర్టిఫికెట్ పొందేందుకు తప్పనిసరిగా శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు జిల్లా ప్రభుత్వ సర్వజనుల ఆసుపత్రి, ఏలూరులో నిర్వహించబడుతున్న ప్రత్యేక మెడికల్ క్యాంపులో హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు. గురువారం ప్రజాశక్తిలో ప్రచురితమైన 'బదిలీల్లో బాధలు' కథనానికి జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించారు. మెడికల్ క్యాంపు ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశారు. గతంలో ఏప్రిల్ 24 నుంచి 26వ తేదీ వరకూ నిర్వహించిన మెడికల్ క్యాంపులో అనివార్య కారణాల వల్ల హాజరు కాలేకపోయిన ఉపాధ్యాయులకు మరోఅవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. వైద్య నివేదికలతో హాజరై, మెడికల్ బోర్డు సమక్షంలో వైద్య పరీక్షలు చేయించుకొని, అవసరమైన వైద్య ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరిగా పొందాలన్నారు. మెడికల్ క్యాంపులో బోర్డు ద్వారా జారీ చేసే వైద్య ధ్రువీకరణ పత్రాల ఆధారంగానే బదిలీల ప్రక్రియలో ప్రిఫరెన్షియల్ కేటగిరీగా పరిగణనలోకి తీసుకోబడతారన్నారు. గతంలో జరిగిన క్యాంపులో ఇప్పటికే వైద్య ధ్రువీకరణ పత్రం పొందిన ఉపాధ్యాయులు ఈ ప్రత్యేక క్యాంపునకు హాజరు కావాల్సిన అవసరం లేదని స్పష్టంగా పేర్కొన్నారు.

ఇవిఎం గొడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరులోని కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల గొడౌన్‌ను గురువారం జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తనిఖీ చేశారు. ఇవిఎం గొడౌన్ వద్ద సిసి కెమెరాలతో చేసిన భద్రతా ఏర్పాట్లను పరిశీంచిన అనంతరం రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇవిఎ గొడౌన్‌కు వేసిన భద్రతా సీళ్లు, సిసి కెమెరాల పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు మొదలైనవి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతీయ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇవిఎం గొడౌన్‌కు పటిష్ట భద్రత కల్పించామన్నారు. ఎప్పటికప్పుడు గొడౌన్‌ను క్షుణంగా తనిఖీ చేసి ఎన్నికల సంఘానికి నివేదిక పంపిస్తున్నామని తెలిపారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది ఉన్నారు.

విశాఖ ఉక్కును కాపాడుకుందాం

పర్సా సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బలరాం పిలుపు

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బలరాం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పర్సా సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా ఆనాటి నాయకుల త్యాగ ఫలంగా వచ్చిన విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుందామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పవరుపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయం ఉద్దరాజు రామం భవనంలో పర్సా సత్యనారాయణ వర్ధంతిని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బలరాం ముందుగా పర్సా చిత్రపటానికి పూలమాల వేయగా మిగిలిన నాయకులు, కార్యకర్తలు పూలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ సభ్యులు పి.మంగరాజు గీతాన్ని ఆలపించారు. అనంతరం బి.బలరాం మాట్లాడుతూ సిపిఎం అగ్రనాయకుల్లో ఒకరు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కార్మిక ఉద్యమాన్ని నిర్మించినవారిలో ఒకరు అయిన పర్స సత్యనారాయణ 2015 మే 22న ఏలూరులో మరణించారని తెలిపారు. పర్స సత్యనారాయ కొత్తగూడెం ప్రాంతంలో బొగ్గుగని ఉద్యమ కార్మిక నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించారని, జీవితంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నారని తెలిపారు. ధైర్య సాహసాలను ప్రదర్శించారని, ప్రాణం మీదకు వచ్చినా తెగించి కార్మికులను ఐక్యం చేసి వారి హక్కుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నడపడమే కాకుండా కార్మిక సంఘాలు ఏర్పాటు చేసిన గొప్ప నాయకుడు సత్యనారాయణ అని కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రధాన పాత్ర పోషించారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో, కార్మికోద్యమ నిర్మాణంలో ఆయన పాత్ర ప్రముఖమైందన్నారు. విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కు అనే పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా పర్స సత్యనారాయణ ప్రధాన పాత్ర పోషించారని, తన శాసన సభ్యత్వాన్ని ఇతర సభ్యులతో కలిసి తృణప్రాయంగా వదులుకున్నారని తెలిపారు. ఆనాడు పర్సా సత్యనారాయణ వంటి నాయకులు విశాఖ ఉక్కు కోసం పోరాటం చేసి సాధిస్తే నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అదే విశాఖ ఉక్కును అమ్మేయడానికి పూనుకోవడం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కు కార్మికులు, ఉద్యోగులు గత ఐదేళ్లుగా పోరాడుతుంటే కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ పేరుతో నమ్మించాలని ప్రయత్నిస్తోందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను, పర్మినెంట్ ఉద్యోగులను తొలగించడమే కాకుండా విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించకుండా, పోర్టు నిర్మాణానికి అనుమతులివ్వకుండా, సౌకర్యాలు కల్పించకుండా, ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను నాశనం చేస్తుంటే ఇక్కడి కూటమి ప్రభుత్వం నోరు తెరవకపోవడం బాధాకరమన్నారు. విశాఖ ఉక్కు తెలుగు జాతి ప్రజల హక్కు అని, పర్సా వంటి నాయకుల త్యాగాన్ని కాపాడుకోవాలని, అందుకు మనందరం సంసిద్ధం కావాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగమణి, డిఎన్‌విడి.ప్రసాద్, ఆర్.లింగరాజు, టి.రామకృష్ణ, జి.రాజు, పి.రామకృష్ణ, కె.శ్రీనివాస్, నేతలు ఎం.సుధారాణి, ఎం.జీవరత్నం, ఎ.ఫ్రాన్సిస్, ఎన్.హనుమాన్లు, టి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పోలవరంలో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

తనిఖీలు చేస్తున్న బాంబ్ స్క్వాడ్

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టులో ఎస్ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో స్పెషల్ బెటాలియన్ బాంబ్ స్క్వాడ్‌లు పలుచోట్ల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇటీవల చత్తీస్‌ఘడ్‌లో జరిగిన భారీ ఎన్ కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేతలు హతమైన నేపథ్యంలో పోలవరం రాకపోకలు సాగించే ఆర్‌టిసి, ప్రయివేట్ వాహనాలను, అనుమానస్పదంగా తిరుగుతున్న వారిని తనిఖీలు నిర్వహించామన్నారు. పోలవరం ప్రాజెక్టులో ప్రధాన ప్రాంతాలను బాంబు స్క్వాడ్‌తో కూడా తనిఖీలు నిర్వహించామని తెలిపారు. మావోయిస్టులు ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో తలదాచుకునే అవకాశాలున్న నేపథ్యంలో డ్రోన్ కెమెరాలతో గాలింపు నిఘా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని, ఎటువంటి అనుమానాస్పద వ్యక్తులను గమనించినా పోలీసులకు తెలియజేయాలని కోరారు.

ప్రీ-ఎక్లాంప్సియా వ్యాధిపై అవగాహన అవసరం

కలెక్టర్ వెట్రిసెల్వి

వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రెగ్నెన్సీ ముందు లేదా ప్రెగ్నెన్సీ సమయంలో అధిక రక్తపోటు (బిపి) ఉంటే తక్షణమే వైద్య నిపుణులతో సలహా పొందడం తప్పనిసరని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో ప్రపంచ ప్రీ-ఎక్లంప్సియా దినోత్సవం సందర్భంగా ప్రీ-ఎక్లంప్సియా వ్యాధిపై అవగాహన కలిగించే పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రీ-ఎక్లంప్సియా తల్లీ, శిశువు ఇద్దరికి ప్రమాదకరంగా ఉంటుందని, దీని మూలంగా మాతృ శిశు మరణాలకు కారణం అవ్వొచ్చని చెప్పారు. ఈ వ్యాధిపై అవగాహన కల్పించడంతోపాటు వ్యాధిని నివారించడానికి అవసరమైన చర్యలను తీసుకునేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. దీనిలో భాగంగా రక్తపోటును (బిపి) క్రమం తప్పకుండా తనిఖీ చేయించడం, మూత్రపరీక్షలు చేయించడం ద్వారా ఈ వ్యాధిని ముందుగా గుర్తించే అవకాశాలను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రజల్లో అవగాహన కలిగించాలన్నారు. అధిక తలనొప్పి, శ్వాశ తీసుకోవడంలో కష్టం, ఉదరంలో నొప్పి, తల, చేతులు లేక కాళ్లవాపులు, మూత్రం ఎక్కువగా రావడం, కంటిచూపులో తేడావంటి ప్రీ-ఎక్లంప్సియా వ్యాధి లక్షణాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్ కుమార్, డిఎంహెచ్ఒ డాక్టర్ ఆర్.మాలిని, ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్, డిఐఒ డాక్టర్ నాగేశ్వరరావు, ఐసిడిఎస్ పీడీ పి.శారద, పలువురు మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ విండోతో ప్రతి అంశాన్ని క్షుణంగా పరిశీలించాలి

జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్

జిల్లాలో సింగిల్ విండో కింద పరిశ్రమల స్థాపనకు, ఇతర ప్రోత్సాహకాల మంజూరు విషయంలో ప్రతి అంశాన్ని క్షుణంగా పరిశీలించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో గురువారం జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ పారిశ్రామికాభివద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని, ప్రభుత్వ ప్రాధాన్యతను అనుసరించి పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తల దరఖాస్తులను పరిశీలించి నిబంధనల మేరకు ఉన్న దరఖాస్తులకు సింగిల్ విండో పథకం ద్వారా నిర్దేశించిన సమయంలోగా అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. సింగిల్ విండో కింద అందిన 84 దరఖాస్తుల్లో ఇప్పటికే 51 దరఖాస్తులు ఆమోదం పొందగా మిగిలిన 33 దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశ్రమల అభి వృద్ధి పాలసీని అనుసరించి 11 పరిశ్రమలకు రూ.31.42 లక్షలు ప్రోత్సాహకాలుగా మంజూరుకు సమావేశం ఆమోదం తెలిపింది. భీమడోలు మండలం అంబరుపేట గ్రామంలోని లిక్సిల్ సిరమిక్ పరిశ్రమ నుంచి జాతీయ రహదారికి సిసి రోడ్డు నిర్మాణానికి సంబం ధించి పరిశీలన చేసి నివేదిక అందించాలని పంచాయతీరాజ్ ఎస్ఇని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం తో పాటు ఫుడ్ ప్రోసెసింగ్ సమావేశాన్ని కలిపి నిర్వహించాలని జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎల్‌డిఎం డి. నీలాద్రి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.ముక్కంటి, జిల్లా అగ్నిమాపక అధికారి సిహెచ్.రత్నబాబు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్.త్రినాధరావు, వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

రోజుకు 1100 రేషన్‌కార్డు దరఖాస్తులు

జిల్లా పౌర సరఫరాల అధికారి శివరామమూర్తి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో రేషన్ కార్డులకు సంబంధించి నేటి వరకు జిల్లా వ్యాప్తంగా సరాసరిన రోజుకు 1100 దరఖాస్తుల వరకు స్వీకరిస్తున్నట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి శివరామమూర్తి తెలిపారు. ఒకేసారి ఎక్కువ మొత్తంలో దరఖాస్తుల స్వీకరణ జరుగుతుండటంతో సర్వర్ బిజీగా ఉండటంతో కొంత ఆలస్యం జరుగుతుందని, ఈ విష యంలో గ్రామ, వార్డు, సచివాలయాల సిబ్బంది అందరూ వారి కార్యాలయాల్లో అందుబాటులో ఉండి దరఖాస్తుల స్వీకరణలో జాప్యం లేకుండా చూడాలని తెలిపారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలి

ఉంగుటూరు : కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియకు సంబంధించిన పలు అంశాలపై గురువారం ఉంగుటూరు నియోజకవర్గం క్యాంపు కార్యాలయంలో నాలుగు మండలాల ఎంపిడిఒ, తహశీల్దార్లతో ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు సమీక్షా సమావేశం నిర్వహించారు. రెండేళ్ల ఆరు నెలల తరువాత కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తూ చేసేకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించటంతో కొత్త రేషన్ కార్డులకు, పాత కార్డుల పునరుద్ధరణకు, పేరు మార్పులు, కుటుంబ సభ్యుల జోడింపు వంటి వాటికి వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులందరకి కొత్త కార్డుల జారీ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అదేశించారు. తహశీల్దార్ పి.రవికుమార్, వైకెవి.అప్పారావు, రమాదేవి, ఎంపిడిఒలు జి.రాజుకుమార్ పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా తాటిచెట్లు

తొలగించాలని బర్రెవారిగూడెం వాసుల ఆందోళన

ఆందోళన చేస్తున్న బర్రెవారిగూడెం వాసులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఎంతో కాలంగా తాము నడిచే రోడ్డుకు అడ్డంగా కొందరు వ్యక్తులు తాటిచెట్లు, ముళ్ల కంప వేసి రాకపోకలు నిలిపి వేశారని, వెంటనే అడ్డుగా వేసిన వాటిని తొలగించాలని మండలంలోని కేతవరం పంచాయతీలోని బర్రె వారిగూడెం వాసులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బర్రెవారిగూడెంలో సుమారు 30 కుటుంబాలు నివాసం ఉంటున్నారని తెలిపారు. ఈ రోడ్డు మార్గాన సుమారు 40 ఏళ్ల నుంచి రాకపోకలు సాగిస్తున్నట్లు వారు తెలిపారు. గత నాలుగు రోజులుగా స్థానికులు కొందరు రోడ్డు మార్గం మూసివేయడంతో బయటకు వెళ్లే దారి లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పోలీసులు స్పందించి రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శి బి.శైలజలతో మాట్లాడారు. రోడ్డును సర్వే చేసి ఇరు గ్రూపులకు న్యాయం చేస్తామని చెప్పి రోడ్డుకు అడ్డుగా ఉన్న తాటిచెట్లు తొలగించడంతో స్థానికులు ఆందోళన విరమించారు.

అభివృద్ధి పథంలో జిల్లా

జిల్లా స్థాయి మినీ మహానాడులో మంత్రి కొలుసు పార్థసారధి

మాట్లాడుతున్న మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు జిల్లాను అభివృద్ధి పథంలో నడుపుతానని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. జిల్లా స్థాయి మినీ మహానాడు నూజివీడు పట్టణ అగ్రికల్చర్ మార్కెట్ యార్డులో గురువారం మంత్రి కొలుసు పార్థసారధి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్తిక విధ్వంసం సృష్టించినప్పటికీ, సిఎం చంద్రబాబు రాష్ట్రంలో అమలు చేస్తున్న విధానాలు, కూటమి ప్రభుత్వ పరిపాలన పట్ల అన్ని తరగతుల ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. గత రెండు వ్యవసాయ సీజన్లలో రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసి, 24 గంటల్లోగా రైతుల ఖాతాలకు సొమ్మును జమ చేశామన్నారు. సిఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్‌తో రాష్ట్రంలోని పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయని, బహుళ జాతి పారిశ్రామికవేత్తలు సంస్థలను ఏర్పాటు చేయడంతో లక్షలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పనకు వీలు కలుగుతుందని, దీంతో రాష్ట్రంలో అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. పెద్దచెరువును పటిష్టం చేసేందుకు నిధులు మంజూరు చేస్తామని సిఎం, ఇరిగేషన్ మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. ఈ మినీ మహానాడులో నూజివీడు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కొన్ని తీర్మానాలు జరిగాయి. నూజివీడు నియోజకవర్గాన్ని ప్రజల సౌకర్యార్థం ఏలూరు జిల్లా నుంచి ఎన్‌టిఆర్ జిల్లాలో విలీనం చేయాలని, చాట్రాయి మండలం పిట్టలవారిగూడెం ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని తీర్మానించారు. పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి, ఎంఎల్‌సి రాజేంద్రప్రసాద్, చింతలపూడి ఎంఎల్‌ఎ రోషన్ కుమార్, దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్, చింతలపూడి మాజీ ఎంఎల్‌ఎ ఘంటా మురళీ, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వల్లభనేని వంశీకి రెండు రోజుల పోలీస్ కస్టడీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు గన్నవరం మాజీ ఎంఎల్ఎ వల్లభనేని వంశీ షాక్ ఇచ్చారు. వంశీ అభిమానులు బెయిల్ మంజూరవుతుందని ఆశించిన సమయంలో నూజివీడు కోర్టు రెండు రోజులు పోలీస్ కస్టడీకి వెళ్లాలని ఆదేశించింది. ఈ నెల 23, 24 తేదీల్లో పోలీస్ కస్టడీ అనంతరం వంశీని కోర్టులో హాజరు పరచాలని ఆదేశించారు. ఈ నెల 16వ తేదీన నకిలీ పట్టాల పంపిణీ కేసులో వల్లభనేని వంశీని నూజివీడు సెకండ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చారు.

జెసి ధాత్రిరెడ్డిచే రేషన్‌కార్డుల ప్రక్రియ పరిశీలన

సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని వివిధ కార్యక్రమాల పరిశీలన నిమిత్తం జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి శుక్రవారం వచ్చారు. మొదట ద్వారకాతిరుమల-1 గ్రామ సచివాలయాన్ని సందర్శించి రేషన్ కార్డుల సర్వీసుల ప్రక్రియను పరిశీలించి సిబ్బందికు తగు సూచనలు చేశారు. జి.కొత్తపల్లి గ్రామంలోని రేషన్‌షాపును తనిఖీ చేశారు. వచ్చే నెల నుంచి రేషన్ షాపుల ద్వారా రేషన్ పంపిణీ అవుతున్న నేపథ్యంలో డీలర్‌కు పలు సూచనలు చేశారు. జి.కొత్తపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 299లో సోలార్ 750 మెగావాట్ల సోలార్ ప్రాజెక్ట్ ఉద్దేశించిన 15 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. ఆమెతో పాటు తహశీల్దార్ జెవి.సుబ్బారావు, సర్వే డిప్యూటీ తహశీల్దార్ అందుగుల మాధవరావు, డిఐఒఎస్ మెహర్ ప్రభు, విఆర్ఒ డివి.గోపాలరావు ఉన్నారు.

ప్రసన్న డెంటల్ ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న పద్మశ్రీప్రసాద్

పట్టణంలో ప్రసన్న డెంటల్ హాస్పిటల్‌ను జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. అత్యాధునిక టెక్నాలజీతో, పరికరాలతో ఆసుపత్రిని ప్రారంభించినట్లు యాజమాన్యం వారు తెలిపారు. అందరికీ అందుబాటులో అతి తక్కువ ఖర్చులతో డెంటల్ ట్రీట్‌మెంట్ చేయనున్నట్లు తెలిపారు. అన్ని ఆపరేషన్లు అతి తక్కువ ఖర్చుతో ప్రజలకు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జి, అలాగే అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మొరాయించిన పెళ్లి బస్సు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

బస్సు మొరాయించంతో రోడ్డుపై పెళ్లివారు

మండలంలోని శ్రీనివాసపురం గ్రామస్తులు పెళ్లి సందర్భంగా ఆర్‌టిసి బస్సు మాట్లాడుకున్నారు. బస్సులో శ్రీనివాసపురం నుంచి పెదవేగి మండలం కొండలరావుపాలేనికి పెళ్లికి వెళ్తుండగా వడ్లపల్లి వద్ద ఆగిపోయింది. పెళ్లికి వెళ్లాల్సిన బంధువులందరూ ఆందోళన వ్యక్తం చేశారు. కాలం చెల్లిన బస్సులు పెడితే మధ్యలో ఆగిపోతే తాము పెళ్లికి ఎలా వెళ్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు. జంగారెడ్డిగూడెం ఆర్‌టిసి డిపో బస్సులు ప్రతినిత్యం ఏదో ప్రాంతంలో మొరాయిస్తున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. మంచి బస్సులు నడపాలని కోరుతున్నారు.

'సిఎం సహాయ నిధితో ఆర్థిక భరోసా'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు సిఎం సహాయ నిధి ఎంతగానో దోహదపడుతుందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.రెండు కోట్ల విలువైన సహాయ నిధి చెక్కులను అర్హులకు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఏలూరు పవర్‌పేటలోని ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో గురువారం సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 18 మంది లబ్ధిదారులకు రూ.18,13,676 విలువైన సిఎం సహాయ నిధి చెక్కులను ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అందించారు. ఈ కార్యక్రమంలో ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి


పరీక్షలు చేస్తున్న వైద్యులు

మండలంలోని లక్ష్మీపురంలో శివాలయం వద్ద గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా మాజీ సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు భార్య పద్మావతి, కుమారుడు ప్రసాద్ జ్ఞాపకార్థం జంగారెడ్డిగూడేనికి చెందిన సాయి దుర్గా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని సర్పంచి సున్నం ఉషారాణి, ఎంపిటిసి సురేష్ చేతుల మీదుగా ప్రారంభించారు. వైద్య శిబిరంలో హనుమాన్ జయంతి వేడుకలకు వచ్చిన వారికి పలు రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. యాత్రికులు అధిక సంఖ్యలో రావడంతో వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంకవారిగూడెం సర్పంచి కుంజా పార్వతి, ఎంపిటిసి సురేష్, సుధారాణి, ఉప సర్పంచి కేతిరెడ్డి రాఘవరెడ్డి, నాయకులు పాండు, రాముడు చౌదరి రెడ్డి సాగర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

అత్యాచారం కేసులో నిందితుడికి జైలు, జరిమానా

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి పోలీసు స్టేషన్‌లో 2021లో నమోదైన అత్యాచారం కేసులో నిందితుడైన బుట్టాయగూడెం మండలం సూరప్పగూడెం గ్రామానికి చెందిన కోసూరి అంజికి ఏలూరు మహిళా కోర్టు ఊదో అదనపు జిల్లా జడ్జి ఆర్‌వివిఎస్.మురళీకృష్ణ పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.పది వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పి.నవీన్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాచన్నగూడెం గ్రామానికి చెందిన ఓ యువతిని 2021లో ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేసి మోసం చేశాడని అప్పట్లో బాధిత యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదైనట్లు తెలిపారు. ఈ మేరకు నేరం రుజువు కావడంతో గురువారం నిందితుడికి పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.పది వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు. అదనపు కట్నం డిమాండ్ చేసినందుకు నిందితుడు అంజితో పాటు అతని తల్లిదండ్రులు కోసూరి రామలక్ష్మి, సాంబశివరావులకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా సిఐ బి.వెంకటేశ్వరావు, ఎస్ఐ నవీన్‌కుమార్, కానిస్టేబుల్ పరమేష్‌లు సహకరించినట్లు తెలిపారు.

కన్నాయగూడెంలో చోరీ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని పొంగుటూరు పంచాయతీ పరిధిలోని కన్నాయగూడెం గ్రామంలో గద్దె రాణి నివాసంలో గురువారం చోరీ జరిగింది. బాధితురాలు గద్దె రాణి తెలిపిన వివరాల ప్రకారం.. పాత పెంకుటిల్లును రేకుల షెడ్డుగా మారుస్తుండగా పక్కనే ఉన్న పూరి గుడిసెలో సామగ్రి పెట్టుకుని అక్కడే నిద్రిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో మెలకువ వచ్చి చూసినప్పుడు ఇంట్లోని పెట్టెను కోసి ఇంటి నిర్మాణం కోసం తెచ్చిన రూ.ఐదు లక్షల నగదు, తొమ్మిది కాసుల బంగారం దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

'శ్రీవెంకటేశ్వర ఎడ్యుకేషన్ సొసైటీ'లో నాణ్యమైన విద్య

విద్యాసంస్థల డైరెక్టర్లు సింగరెడ్డి సత్యనారాయణ, కామూరి నాగేశ్వరరావు, గర్రె శ్రీధర్


సత్యనారాయణ


నాగేశ్వరరావు


సుధాకర్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

శ్రీ వెంకటేశ్వర ఎడ్యుకేషన్ సొసైటీ స్కూలు, జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్య అందుతుందని డైరెక్టర్లు సింగరెడ్డి సత్యనారాయణ, కామూరి నాగేశ్వరరావు, గర్రె శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడుతూ స్కూల్, జూనియర్ కళాశాలను 2013లో స్థాపించినట్లు తెలిపారు. గత 13 ఏళ్లుగా స్కూల్, కాలేజీ విద్యార్థులు ఉత్తమ మార్కులు, ర్యాంకులు సాధిస్తున్నట్లు చెప్పారు. బెస్ట్ స్కూల్, కాలేజీగా పేరు ప్రఖ్యాతలు పొందినట్లు తెలిపారు. ఐఐటి, జెఇఇ, నీట్‌కి అసలైన చిరునామా వెంకటేశ్వర ఎడ్యుకేషన్ సొసైటీ అని చెప్పారు. ప్రీ ప్రైమరీ స్కూల్, ప్రైమరీ స్కూల్, బాలుర, బాలికల హై స్కూల్స్, బాలుర, బాలికల జూనియర్ కాలేజీస్ నీట్ అకాడమీ, ఐఐటి అకాడమీ ఉన్నాయని తెలిపారు. బాలికలకు ప్రత్యేకమైన క్యాంపస్, బాలురకు ప్రత్యేకమైన క్యాంపస్ ఉన్నాయన్నారు. హాస్టల్ వసతి కూడా ఉందని చెప్పారు. బైపిసి, ఎంపిసి విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారన్నారు. ఇక్కడ విద్యార్థులకు విశాలమైన ఆట స్థలం మంచి మంచి ఉపాధ్యాయులచే విద్యాబోధన కలిగి ఉన్నాయన్నారు. స్కూలు, హాస్టల్ నిరంతరం సీసీ కెమెరా పర్యవేక్షణలో ఉంటాయన్నారు. 24/7 జనరేటర్ సదుపాయం ఉందన్నారు. ఆర్ఒ మినరల్ వాటర్‌ప్లాంట్ ఉందన్నారు. తమ విద్యా సంస్థలో పిల్లలను చదివించడానికి జంగారెడ్డిగూడెం, పరిసర ప్రాంత ప్రజలు ఎంతో శ్రద్ధ చూపిస్తున్నారని తెలిపారు.

శ్రీవెంకటేశ్వర ఎడ్యుకేషన్ సొసైటీ విద్యాసంస్థలు

రూ.270 కోట్లతో విద్యుత్ శాఖలో ఆధునీకరణ పనులు

ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

రూ.270 కోట్లతో విద్యుత్ శాఖలో ఆధునీకరణ పనులు చేపడుతున్నట్లు చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. జిల్లా విద్యుత్ శాఖాధికారులతో, వినియోగదారులతో ఆయన శుక్రవారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన రైతులు, గృహ వినియోగదారులు పాల్గొని శాఖ పరంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ శాఖాధికారులను ఎంఎల్ఎ ఆదేశించారు. ఎంఎల్ఎ మాట్లాడుతూ అధికారులు ప్రజలతో సత్సంబంధాలు, సరైన భావవ్యక్తీకరణ కలిగి మెలగాలన్నారు. రూ.270 కోట్లతో ఆర్‌డిఎస్ఎస్ పథకం కింద గ్రామీణ, పట్టణ ప్రాంతంలో 24 గంటల విద్యుత్ సరఫరా తొమ్మిది గంటల పాటు వ్యవసాయానికి విద్యుత్ అందించే లక్ష్యంతో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గడిచిన రెండు దశాబ్దాల కాలంలో ఈ విధంగా అధికారులతో, ప్రజలతో మమేకమై ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేసిన ఎంఎల్ఎగా రోషన్ కుమార్ చరిత్రలో నిలిచారని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు, కార్యకర్తలు, విద్యుత్ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వినోదాత్మకంగా వేసవి విజ్ఞాన తరగతులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు 21వ రోజు గురువారం ఎంతో వినోదాత్మకంగా జరిగాయి. తొలుత విద్యార్థులకు గ్రంథాలయ సిబ్బంది పుస్తక పఠనంలోని పంచతంత్ర కథలు, అక్బర్-బీర్బల్, నీతి కథలను బోధించారు. అనంతరం జ్ఞాపకశక్తిని మెరుగు పరిచే విధంగా ఆటలు ఆడించారు. రిసోర్స్ పర్సన్ ఆర్.అయ్యప్పకుమార్ విద్యార్థులకు ఒక తెలివైన రైతు అగ్ని ప్రమాదం నుంచి రైతు ఎలా బయటపడ్డాడనే కథ సారాంశం, నీతి కథలను బోధిస్తూ ఆ కథలోని నీతిని చిన్నారులచేత వివరించారు. తొలుత రిసోర్స్ పర్సన్ వై.ఫణికాంత్, ప్రముఖ నృత్యకళాకారులు విద్యార్థులకు నృత్యాలపై శిక్షణ కొనసాగించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, బి.రమేష్, ఎండి.అస్లాంపాషా, ఎం.కనకదుర్గ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని రామన్నపాలెం ఎంపిపి పాఠశాలకు చెందిన బొంతు అర్జున్, పసుపులేటి లక్ష్మీప్రసన్న విద్యార్థులు 2025-2026 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో సైనిక్ స్కూల్ ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ఉత్తమ మార్కులు పొంది ప్రవేశానికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్.భవానిశంకర్ తెలిపారు. విద్యార్థులను, పాఠశాల ఉపాధ్యాయులను యుటిఎఫ్ మండల సంఘాల నాయకులు అభినందించారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ పట్ల పంచాయతీ కార్యదర్శులు అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా ప్రాజెక్ట్ వనరుల కేంద్రం కో-ఆర్డినేటర్ ప్రసంగరాజు హెచ్చరించారు. గురువారం సాయంత్రం ఆయన ఆగిరిపల్లి ఎంపిడిఒ బి.ఆనంద్‌బాబుతో కలిసి ఆగిరిపల్లి, నూగొండపల్లి గ్రామ పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు ప్రతి గ్రామంలో క్లాప్ మిత్రాల ద్వారా తడి, పొడి చెత్తను సేకరించి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించి, వర్మీ కంపోస్టును తయారు చేసి పంచాయతీలకు ఆదాయం సమకూర్చేలా కార్యదర్శులు, చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యోగాంధ్రాలో ప్రజలను భాగస్వామ్యం చేయండి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

యోగాంధ్రలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం యోగాంధ్ర కార్యక్రమంపై జిల్లా, మండలస్థాయి అధికారులతో కలెక్టర్ వెట్రిసెల్వి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 21 వరకు యోగా ప్రాముఖ్యతను విస్తృత ప్రచారం ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించాలన్నారు. యోగా ప్రాముఖ్యతను తెలిపేలా విద్యార్థులకు ఆయా రంగాల్లోని వారికి వివిధ పోటీలను నిర్వహించాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం చేసేందుకు మండల, గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మండలంలో యోగా శిక్షకులను గుర్తించి అభ్యాస కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఎక్కువ సంఖ్యలో యోగా అభ్యాసాలకు ప్రజలను నమోదు చేసేందుకు కృషి చేయాలన్నారు.యోగాడే లో పాల్గొనే వారి పేర్లు నమోదు చేసుకునేందుకు రూపొందించిన యాప్‌పై అవగాహన కల్పించాలన్నారు. ప్రతిరోజు జిల్లాలోని ఏలూరు నగరంతో పాటు మున్సిపాలిటీల్లో మండల స్థాయిలో యోగా ప్రాముఖ్యతను తెలిపే కార్యక్రమాలను నిర్వహించాలని ఎంపిడిఒలను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో పర్యాటక సంబంధిత ప్రదేశాల్లో యోగా ప్రాముఖ్యతపై కార్యక్రమాలు నిర్వహించాలని పర్యాటకశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ద్వారకాతిరుమల హరిత హోటల్ వద్ద ఈ నెల 29వ తేదీన, పోలవరం మండలం పట్టిసీమ రివర్ ఇన్ రిసార్ట్ వద్ద జూన్ ఐదో తేదీన, జంగారెడ్డిగూడెం మద్ది ఆంజనేయస్వామి దేవాలయంలో జూన్ 11వ తేదీన, కామవరపుకోట మండలం జీలకర్రగూడెం గుంటపల్లి బౌద్ధ గుహల వద్ద, జూన్ 18వ తేదీన యోగా కార్యక్రమాలను నిర్వహిం చాలన్నారు. సంబంధిత ఎంపిడిఒలు ఈ కార్యక్రమాలను పర్యాటకశాఖాధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు.

మహనీయుడు ఎన్‌టి.రామారావు

విగ్రహావిష్కరణలో మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - ముసునూరు


ముసునూరు : మాట్లాడుతున్న మంత్రి పార్థసారధి

పేద, బడుగు, బలహీన తరగతుల వారికి అండగా నిలిచిన వ్యక్తి కీర్తిశేషులు నందమూరి తారకరామారావు అని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. మండలంలోని వేల్పుచర్ల నందమూరి తారకరామారావు విగ్రహాన్ని ఆయన శుక్రవారం ఆవిష్కరించి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలకు కూడు, గూడు, గుడ్డ, రెండు రూపాయలకే కిలో బియ్యం, జనతా వస్త్రాలు ఇచ్చి పేదలను అన్ని విధాలుగా ఆదుకున్న గొప్ప నాయకుడు ఎన్‌టి రామారావు అని కొనియాడారు. మహిళలకు ఆస్తి హక్కు, రాజకీయల్లో రిజర్వేషన్ కేటాయించి, మహిళల్లో చైతన్యం తీసుకొచ్చిన మహానుభావుడని అన్నారు. ఎన్‌టిఆర్ ఆశయాలు, లక్ష్యాలను, సాధించడానికి సిఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు ముందుకు తీసుకెళు న్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ :ఆంధ్రుల ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహానుభావుడు అన్న నందమూరి తారకరామారావు అని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. మండలంలోని జంగంగూడెంలో కీర్తిశేషులు నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఆయన శుక్రవారం ఆవిష్కరించి పూల దండ వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి రానున్న మార్చి నుంచి ఇళ్లు కట్టుకునేవారికి రూ.2.50 లక్షలు అందిస్తున్నామన్నారు. త్వరలో ఇళ్ల స్థలం లేని వారికి అర్బన్ పరిధిలో రెండు సెంట్లు, రూరల్‌లో మూడు సెంట్ల భూమిని అందిస్తామన్నారు. రానున్న ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించే బాధ్యత కూటమి ప్రభుత్వానిదన్నారు. త్వరలో అమరావతి రాజధాని నిర్మిస్తామని, సిఎం చంద్రబాబు కృషితో విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేట్ పరం కాకుండా కాపాడామని, ప్రభుత్వమే పరిశ్రమను నడుపుతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. ప్రజలకు ఎటువంటి కష్టం వచ్చినా అన్ని విధాలుగా ఆదుకోవడానికి నియోజకవర్గంలో తాను రాష్ట్రంలో ప్రభుత్వం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతమనేని చొరవతో కోలుకున్న బాలుడు

ఎంఎల్ఎకు తల్లిదండ్రుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి - దెందులూరు


మాట్లాడుతున్న చింతమనేని ప్రభాకర్

డాక్టర్లు సైతం అతి కష్టమంటూ చెప్పిన తరుణంలో అన్ని విధాలా అండగా నిలిచి తమ బిడ్డ ప్రాణాలతో జీవించేలా సహకరించిన దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌కు గుడివాకలంక గ్రామానికి చెందిన మోరు రమేష్, సుమిత్ర దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. ఏడాది క్రితం ఏలూరులోని సెయింట్ జేవియర్ స్కూల్లో ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక గ్రామానికి చెందిన మోరు రమేష్, సుమిత్ర దంపతుల కుమారుడు మోరు సుధీర్ (13) ఏడవ తరగతి చదువుతూ అక్కడే ఉన్న సెయింట్ జేవియర్ హాస్టల్‌లో ఉండేవాడు. అయితే 2024 జులై 24వ తేదీ అర్ధరాత్రి వేళ అదే హాస్టల్లో ఉంటున్న మరొక విద్యార్థి చేసిన దుర్ఘటనలో పెట్రోల్ శరీరానికి అంటుకుని నిద్రమత్తులో ఉన్న సుధీర్ అగ్ని ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే హాస్టల్ నిర్వాహకులు బాలుడిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న చింతమనేని ప్రభాకర్ హుటాహుటిన విద్యానగర్‌లోని పోజ్జోలి హాస్పిటల్‌కు చేరుకుని బాలుడిని మెరుగైన చికిత్స అందించేలాగా ఏలూరులోని జిల్లా సర్వజన ఆస్పత్రికి తక్షణమే తరలించాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ వైద్యాధికారులకు ఫోన్ ద్వారా సూచించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించారు. చింతమనేని విజయవాడలోని ఆసపత్రి వైద్యాధికారులతో మాట్లాడి ఎట్టి పరిస్థితుల్లో బాలుడు క్షేమంగా ప్రాణాలతో తిరిగి రావాలని, అందుకు ఎంత ఖర్చైనా సరే వైద్యం కొనసాగించాలని, సిఎం సహాయ నిధి నుంచి కూడా సహకారం అందిస్తామని అన్ని విధాలా కూడా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో బాలుడు వైద్యానికి కనీసం రూ.12 నుంచి రూ.15 లక్షలకు పైగా ఖర్చవుతుందని తెలియడంతో చింతమనేని పిలుపుమేరకు గుడివాకలంక గ్రామస్తులంతా కూడా ఎంతో ప్రేమాభిమానాలతో ముందుకు తరలివచ్చి సుధీర్ కుటుంబానికి అండగా నిలిచారు. బాలుడు సుధీర్ ప్రస్తుతం సంపూర్ణంగా కోలుకొని తిరిగి తన ఇంటికి చేరుకున్నాడు. ఎంఎల్ఎ చింతమనేని సూచనల మేరకు బాలుడికి హాస్టల్ నిర్వాహక సంస్థ సైతం ముందుకు వచ్చి వారి తరపున రూ.ఐదు లక్షల ఆర్థిక సహాయాన్ని బాలుడి కుటుంబ సభ్యులకు అందించారు. గురువారం ఉదయం దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ అధికారి లక్ష్మమ్మ సమక్షంలో హాస్టల్ నిర్వాహక సంస్థ ప్రతినిధులు గుడివాక లంక టిడిపి నాయకుల సమక్షంలో ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ చేతుల మీదుగా రూ.ఐదు లక్షల ఆర్థిక సహాయాన్ని బాలుడి కుటుంబ సభ్యులకు అందించారు.

అంధకారంలో కొత్తపల్లి సెంటర్

మూడు నెలలుగా వెలగని వీధి దీపాలు
గ్రామస్తుల ఇబ్బందులు
అధికారులు స్పందించాలని వేడుకోలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వణుదుర్రు గ్రామపంచాయతీ శివారు కొత్తపల్లి గ్రామం అంధకారంగా తయారైంది. గ్రామంలో వీధి దీపాలు పాడై నెలలు గడుస్తున్నా గ్రామ పంచాయతీ పట్టించుకోకపోవడంపై కొత్తపల్లి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని ఆర్‌సిఎం చర్చి వెనుక బజార్, అంబేద్కర్ విగ్రహం ఉన్న బజార్, కొత్తపల్లి ప్రధాన సెంటర్‌తో పాటు తదితర ప్రాంతాల్లో గత మూడు నెలలుగా వీధిలైట్లు మరమ్మతులకు గురై వెలగడం లేదు. దీంతో కొత్తపల్లి మొత్తం అంధకారంగా మారింది. ఈ విషయమై పలు సార్లు పంచాయతీ పాలకవర్గానికి, పంచాయతీ కార్యదర్శికి గ్రామస్తులు విన్నవించినప్పటికీ పట్టించుకోవడంలేదంటూ గ్రామస్తులు చెబుతున్నారు. కొత్తపల్లిలో విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో చీకటిమయంగా ఉండి పలు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి వీధిలైట్లకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని పలుసార్లు చెప్పినప్పటికీ ఈ విషయం పెడచెవిన పెడుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. వీధిలైట్లు ఏర్పాటు చేసి ప్రజలు పడుతున్న చీకటి ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. వీధి లైట్లు వెలగకపోవడంతో తరచు కొత్తపల్లి సెంటర్‌లో ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా నివాసాల మధ్యలో, వీధి దీపాలు వెలగకపోవడంతో నివాసితులు భయాందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. అసలే వేసవి కాలం, దీనికి తోడు మండలంలో దొంగల బెడద ఎక్కువగా ఉండడంతో కొత్తపల్లి గ్రామస్తులు దొంగల భయంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ కార్యదర్శి స్పందించి వెంటనే వెలగని వీధిలైట్ల స్థానంలో కొత్త లైట్లు ఏర్పాటుచేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలంటూ వణుదుర్రు గ్రామపంచాయతీని ముక్తకంఠంతో కోరుతున్నారు.

అంధకారంలో అంబేద్కర్ విగ్రహం ఉన్న బజార్

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని దర్భగూడెం గ్రామంలోని కిందపేటలో మోటార్ సక్రమంగా పని చేయక తరచూ నీటి సమస్య వస్తుండటంతో గ్రామస్తులు ఎంఎల్ఎ బాలరాజు దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్తులు, హోప్ మినిస్ట్రీస్ సహకారంతో ఎంఎల్ఎ నిధుల నుంచి కొంత నగదుతో నూతన బోరును ఏర్పాటు చేశారు. బోరును గురువారం ఎంఎల్ఎ బాలరాజు చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సున్నం ఉషారాణి, ఎంపిటిసి సభ్యులు సురేష్, సుధారాణి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌బాబు, నాయకులు తమ్మన సాంబ, గంగిరెడ్డి, కన్నయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వెళ్లే రహదారి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు అధికారులను కోరారు. రోడ్డు నిర్మాణ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి ఎస్ఇ, డిఇ, ఎఇలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు.

'పోలవరాన్ని జిల్లా కేంద్రంగా చేసేలా చర్యలు హర్షనీయం'

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టులో ముంపు మండలాలన్నింటినీ కలిపి పోలవరం జిల్లాగా ఏర్పాటు చేయడానికి సిఎం చంద్రబాబు చర్యలు తీసుకోవడం పట్ల పోలవరం జిల్లా సాధన సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం పోలవరంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో పోలవరం జిల్లా సాధన సమితి సమావేశం నాళ్లం గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ముంపు మండలాలన్నింటిని కలిపి పోలవరం జిల్లా కేంద్రంగా చేసి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టుతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. సిఎం చంద్రబాబు జిల్లా ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంతో ముంపు గ్రామాల వారి గుండెల్లో ఆనందోత్సవాలు వెల్లు విరిశాయన్నారు. ఈ సమావేశంలో పోలవరం జిల్లా సాధన సమితి నాయకులు బుగ్గ మురళీకృష్ణ, కొణతాల ప్రసాద్, సొబ్బన మోహన్, మంగిన వెంకటరమణ, ముత్యాల రాంబాబు, గ్రంధి బాలకృష్ణ, సొబ్బన రాజశేఖర్ బాబు, యడ్ల వినోద్, పట్నాల నారాయణరావు పాల్గొన్నారు.

టిడిపిలోకి 300 మంది వైసిపి కార్యకర్తలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

వైసిపి మండల ముఖ్య నాయకులు పొట్లూరి అశోక్, జంగంగూడెం గ్రామ సర్పంచి పొట్లూరి అంజనీకుమారి, వైస్ ప్రెసిడెంట్ మందపాటి నాగరాజు, పది మంది గ్రామ వార్డు మెంబర్లు, 200 మంది అనుచరులతో కలిసి రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పార్థసారది సమక్షంలో టిడిపిలో చేరారు. మండలంలోని జంగంగూడెం గ్రామానికి విచ్చేసిన మంత్రి పార్థసారధిని ట్రాక్టర్లు, ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీగా వెళ్లి భారీగా బాణసంచాలు కాలుస్తూ జంగంగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన రెండు ఎన్‌టిఆర్ విగ్రహాలను ప్రారంభించారు. అనంతరం పొట్లూరి అశోక్, గ్రామ సర్పంచి అంజనీకుమారి, వార్డు మెంబర్లను, అనుచరులను పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అందరూ కలిసిమెలిసి పనిచేసుకోవాలని, ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే తప్పనిసరిగా పరిష్కరిస్తారని మంత్రి పార్థసారధజ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జంగంగూడెం గ్రామ అధ్యక్షులు హనుమంతరావు, తెలుగు యువత మాజీ అధ్యక్షులు వల్లభనేని భాస్కర్, టిడిపి నాయకులు చెరుకూరి దుర్గాప్రసాద్, కాపా శ్రీనివాసరావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

I.A.No. 47/2025 in O.S.No. 38/2016

Between:

శ్రీమతి కొప్పుల రమాదేవి వగైరా ...పిటిషనర్/వాది

మరియు

కొప్పుల వెంకటరావు (died) 8 వగైరా ...రెస్పాండెంట్/ప్రతివాదులు

To,
R9 Smt. తాళ్ళపోసు లక్ష్మి, భర్త: చంద్రశేఖర్,
పూలపల్లి ఏరియా, పాలకొల్లు మండలం,
పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

పై నెంబరు దావాలో పిటిషనర్ I.A. No. 47/2025 దాఖలు చేసి అందు మిమ్మల్ని 9వ ప్రతివాదిగా జాయిన్ చేయుటకు అనుమతి కోరినందున, శ్రీ కోర్టు వారు నోటీసులు అనేక పర్యాయములు పంపించినప్పటికి మీరు తీసుకోనని కారణముగా శ్రీ కోర్టు వారి అనుమతి మేరకు ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా.

మీ యొక్క హాజరు నిమిత్తం **ది. 19-06-2025వ తేది** వాయిదా కలదు. కావున వాయిదా తేదిన శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని **ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరై మీకు అభ్యంతరములున్న యెడల తెలియజేసుకోనగలరు. లేనియెడల మీ పరోక్షమున తదుపరి గ్రంధము వెలువడునని తెలియపరచడమైనది.

ఐ. శివసాంబమూర్తి
కె. రాంబాబు
అడ్వకేట్స్, పాలకొల్లు

పాలకొల్లు
ది.20-05-2025